# గంగారామ్

వీరభద్రం ప్రభుత్వం పనిమీద మహానగరం వెళ్ళవలసివచ్చింది. అక్కడ ఒక హోటల్లోదిగాడు. అది ఖరీదైన హోటలు, అన్ని సౌకర్యాలుఉన్నాయి. ఎయిర్ కండిషన్డు గదులతోసహ. గదులు తీసుకున్నవాళ్ళకు కాఫీ టిఫిన్లు భోజనాలు గదులలోకే సప్లయి జరిగేది.

వీరభద్రం రెండు ఆఫీసులుతిరిగి, తన పని కొంత చేసుకుని, ఆనాటికింక కాదని నిరాశచెంది, హోటల్‌కువచ్చి తనకు భోజనం పంపించమని ఫోనుచేశాడు కిందికి.

పావుగంటలో ఒక సర్వరు భోజనం తీసుకువచ్చి ''మళ్ళీ వస్తాను సార్.'' అని వెనక్కు తిరిగి వెళ్ళిపోతున్నాడు.

"ఉండు ఒక్క నిమిషం మొన్న భోజనం తెచ్చిందికూడా నీవేకదూ?'' అడిగాడు. అతడిని చూడగానే పలకరించాలనిపించింది.

"అవును నేనే సార్" అతడు తొందరమీద ఉన్నట్లుగా తలుపువైపు చూస్తున్నాడు.

"నీ పేరు?"

"గంగారామ్."

"హాయిగాచదువుకునే ఈడులో ఈ హోటల్ సర్వరు ఉద్యోగమేమిటినీకు?"

''మళ్ళీవచ్చినప్పుడు చెప్తాను సార్ ఆలస్యమయిందని మేనేజరు కోప్పడతాడు.''

''సరేలే మళ్ళీ వస్తావుగా?'' అన్నాడు.

''గంగారామ్ పన్నెండు పదమూడేళ్ళపిల్లవాడు ఎర్రగాఉన్నాడు. హోటల్

యూనిఫారమ్‌లో ఉన్నాడు. కాని అతడు మురికిగా ఉన్నట్టుంటాడు. రోజుస్నానం చేసి, రెండుపూటలా ముఖం సబ్బుతో కడుక్కుంటే ఇంకా ఎర్రగా ఉంటాడని పించింది.

వీరభద్రం భోజనం ముగించి గంటకొట్టగానే గంగారామ్ పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"నీవేవచ్చావా? అప్పుడడిగిన ప్రశ్నలకు మళ్ళీవచ్చి చెబుతానన్నావు. ఇప్పుడు చెప్పు?"

"ఇప్పుడు రష్ తగ్గిపోయింది. చెప్తానుసర్ చదువుకోవలిసినఈడులో ఈపని ఎందుకు చేస్తున్నావని అడిగారు. చదువుకోటానికి వీలుకాలేదుసార్. అన్నలంతా ఎక్కడో ఉద్యోగాలు చేసుకుంటున్నారు. అక్కలకు పెళ్ళిళ్లయ్యాయి. నాయన పోయినప్పుడు నాకు ఆరేళ్లు. నాకు అక్షరాలువచ్చు అంకెలు నేర్చాను. అమ్మకూ నాకు తిండిగడవాలికదాసార్. ఎంతోమందినడిగి సిఫారసులుచేయించుకుని ఎంతో ఆశతో ఈ కొలువులో పెట్టించింది మా అమ్మ. అప్పుడు నాకు తొమ్మిదేళ్లు"

''అయ్యో అంతచిన్నవయసులో వచ్చావా? హోటలుపనికి తీరిక ఉండ దంటారు నిజమేనా?''

''అన్నంసార్ కడుపులోకి అన్నంకావాలికదా? ఇద్దరికడుపులు నిండాలి. అందుకని ఏదో ఒకపని చెయ్యాలిమరి" అతడు పళ్లెంగ్లాసులు తీసుకువెళ్లాడు.

వీరభద్రం ఫైళ్లుచూసుకుంటూ కూర్చున్నాడు. మూడుగంటలు కాగానే కాఫీ టిఫిన్ తీసుకురమ్మని ఫోను చేశాడు.

కొత్త సర్వరు కాఫీ టిఫిన్ తెచ్చాడు. ఎవరొచ్చినా వాళ్ళ పేరూ ఊరూ అడగటం వీరభద్రం అలవాటు. అతడినిచూడగానే ఊరూ పేరూ అడగబుద్ధిపుట్ట లేదు కాని-

"ఏమిటోయ్! నీ చేతివేళ్ళు అలా కమిలిపోయా ఏమిటి? కాల్చుకున్నావా?" అడిగాడు.

''వేడి వేడి టీ చేతిమీద పడింది. పొరబాటున కేటిల్లోనుంచి కప్పులో పోస్తుంటే వేళ్ళమీదపడ్డది'' అన్నాడు.

కొన్ని రోజులయినతరువాత సర్వర్లువస్తే వాళ్ళనునవ్విస్తూ మాట్లాడించటం వాళ్ళకేదయినా డబ్బులిస్తూఉండటం అలవాటయింది వీరభద్రానికి. వాళ్ళతో జోకు లేస్తూ నవ్వుతూ ఉండేవాడు.

ఒక రోజున భీమ్‌రాజనే సర్వరువచ్చాడు. అతడికి ఇంచుమించుగా గంగారామ్ వయసే ఉంటుంది.

"నీవు ఇదివరకూ రాలేదుకదూ?" అన్నాడు వీరభద్రం.

అవునన్నట్లు తలఊపాడు.

"ఎన్నేళ్ల పిల్లలను తీసుకుంటారిక్కడ?''

"ఎనిమిదేళ్ళ పిల్లల దగ్గర్నుంచి పాతికేళ్ళ వయసుగల వాళ్లున్నారిక్కడ.. నా వయసు పదమూడు" అన్నాడు.

"నీ కెంత జీతమిస్తారు?" వీరభద్రానికి ఎప్పుడూ ఏదో ఒకటి మాట్లాడే అలవాటు.. అక్కడి సర్వర్లందరూ హిందీ మాట్లాడేవారు. అతడు మాట్లాడకుండా వెళ్లాడు.

ఆ మహానగరంలో ఎన్నో హోటళ్ళున్నాయి - కొన్ని చిన్నవీ-కొన్ని మరీ పెద్దవీను. కొన్ని హోటళ్ల పేరు ప్రతిష్ఠలు కలిగినవి ఉన్నాయి. సర్వర్లు పాతిక మందికిపైన ఏభయిమందివరకూ ఉంటారు ఒక్కోదానిలో.

గంగారామ్ వీరభద్రానికి కొన్ని రోజులనుంచీ కనబడటమే లేదు. అతడేమయినాడని అడిగితే కింద పనిలో ఉన్నాడని చెప్పేవాళ్ళు.

వీరభద్రానికి గంగారామ్ ఇంకా ఎప్పుడువస్తాడన్న ఆతురత. ఒక రోజున అతడొచ్చాడు.

"నీవు రావటంలేదేమోయ్?" అని వీరభద్రం ఆప్యాయంగా బుజమ్మీద చెయ్యేసి అడిగాడు.

గంగారామ్ కళ్ళెత్తి వీరభద్రం ముఖంలోకిచూసి కళ్లుదించుకున్నాడు.

"ఊరికెళ్లావా"

"ఊరికెళ్ళటానికి డబ్బులేవీ? అమ్మకిద్దామంటే పదిరూపాయలయినా లేవు" అన్నాడు.

"నీ జీతమెంత? ఎంతకాలంనుంచో పనిచేస్తున్నానన్నావుగా?"

"చేస్తున్నాను. నాకు రోజుకు ఐదురూపాయలజీతం. నేను ఇంతకాలంనుంచీ పనిచేస్తున్నానుగాని ఊరికివెళ్ళి అమ్మను చూడనివ్వరు. ఆమెకు పంపుదామంటే జీతమివ్వరు.

''నీకేనా అందరికీ ఇంతేనా?''

''ఇంతే ననుకుంటాను. ఎవరినడిగినా ఇదేమాట చెబుతారు. ఏమిటో-నాకు పూర్తిగా తెలియదు''

నాలుగు రోజుల తరువాత మళ్ళీ గంగారామ్ వచ్చాడు. చేతులు ఒళ్ళూ నల్లగా కమిలిపోయి ఉన్నాయి.

''మొదటిరోజున నీవు కనబడ్డప్పుడు నీ చేతివేళ్ళు కమిలిపోవటం గమనించాను. కాని ఇంకేమిటో ననుకున్నాను ఇవాళ మళ్ళీ చూస్తున్నాను. వేడి వేడి దేమయినా ఒంటిమీద పోసుకున్నావా? జాగ్రత్తగా పనిచేయటం నేర్చుకోలేదా ఇంతకాలంనుంచీ?"

తలవంచుకున్నాడు గంగారామ్.

''నేను ఇక్కడికి వచ్చిన పని అయిపోవచ్చింది. రెండు రోజుల్లో వెళ్ళిపోతాను. ఈ యూనిఫారమ్‌లో నీవు ఎంతో అందంగా కనిపిస్తావు. అయినా నీకీ సంగతి ఎట్లా తెలుస్తుంది? చూసేవాళ్ళకు తెలుస్తుందిగాని నిజమా అబద్ధమా చెప్పు?''

అతడి కళ్లనీళ్ళు బుగ్గల మీదుగా జాలువారుతున్నాయి.

''అదేమిటి? ఏడుస్తున్నావు? నేన్నది తప్పుమాటా?" కాదని తలఊపాడు.

"మరెందుకేడుస్తున్నావు? చెప్పు? నేను ఊరికి వెళ్ళేటప్పుడు సర్వర్లకందరికీ టిప్ ఇస్తాను. నీవంటే నాకు ప్రత్యేకమయిన అభిమాన మేర్పడింది. అందుకని నీకు కొంచెం ఎక్కువయిస్తాను''

"ఎందుకు సార్? మీరిచ్చినా ఒకటే ఇవ్వకపోయినా ఒకటే.''

"ఎందుకు? డబ్బుంటే బట్టలు కొనుక్కోవచ్చు. ఊరికి పంపవచ్చు. డబ్బు వద్దనే వాడిని నిన్ను ఒకడినే చూశాను."

''అదికాదు సార్. మా సంగతి చెబితే మీరు నమ్మరు. చిన్న చిన్న తప్పులకు మాకు శిక్ష ఎట్లా ఉంటుందో తెలుసా సార్? మరుగుతున్న నీళ్ళను మీద పోస్తారు. మీ అటువంటి వాళ్లు ఇచ్చిన డబ్బును సాయంత్రం కాగానే లాక్కుంటారు. మాకు నెలనెలకూ జీతాలు ఇవ్వరు. అడిగితే కొడతారు. మా కందరికీ గాలీ వెలుతురూరాని పెద్ద హాలొకటి కింద ఉన్నది. తప్పులు చేసిన వాళ్ళనూ జీతాలడిగిన వాళ్ళనూ కర్రలతో, సైకిల్ చైన్లతో కొడతారు. ఎవరినీ బైటికి పోనివ్వరు.'' కళ్లు తుడుచుకున్నాడు.

''అంటే మీచేత పనిచేయించుకుని ఖైదీల మాదిరిగా చూస్తారన్నమాట''

"అంతకంటె అన్యాయం. మా ఒళ్లంతా వాతలు తేలుతుంది తెల్లవా రేసరికి మంటలు పుడతాయి. అందరూ వెళ్ళిపోయిన తరువాత యూనిఫారాలు గోడకు తగిలించాలి. మా బట్టలెట్లా ఉంటాయనుకున్నారు? మాసిపోయిన గుడ్డపేగులు. కొనటానికి ఢబ్బులేదు. ఉతుక్కోటానికి సబ్బులేదు. టైమ్‌లేదు. ఈ సంగతులు ఎవరికీ చెప్పకూడదు. ఎవరితోనూ మాట్లాడకూడదు సార్. చాలా సేపయింది వచ్చి నేను వెళ్తాను" వెళ్ళిపోయాడు.

వీరభద్రంతో ఇంకొక ఆఫీసరు వచ్చాడు. అతడు ఇంకొక హోటల్లో దిగాడు. అది ఈ హోటల్ దగ్గర్లోనే ఉంది.

వెళ్లేనాడు అందరికీ తలా పదిరూపాయలు టిప్ ఇచ్చాడు. వాళ్ల ముఖాలు ఏమి సంతోషంగాలేవు. గంగారామ్ వీరభద్రం రెండు చేతులూ పట్టుకుని ఏడ్చాడు.

''సార్ మీతో నేను వచ్చేస్తాను"

''మరి ఇంత జీతం వదలుకుంటావా? ఇంత జీతం ఇంకెక్కడయినా దొరుకుతుందా?"

''పేరుకు జీతాలుగాని అవి ఇచ్చేవికావని అందరికీ తెలుసు. దీనిలో నుంచి బైటపడితే చాలనిపిస్తోంది.

''అయితే నాతో వచ్చెయ్యి''

''అయ్యో ఎంత పిచ్చివాడిని? అట్లా వెళ్ళనిస్తే ఎప్పుడో వెళ్ళేవాడిని'' కళ్లు తుడుచుకున్నాడు.

''అయితే ఏం చెద్దాం చెప్పు? నాకు సహాయం చేయాలనుంది నీకు?

''సార్ మా మేనేజరు అటు వెళ్తూ మనం మాట్లాడుకోవటం చూడనే చూశాడు. 'ఆయనతో ఏం మాట్లాడుతున్నావు? ఏమయినా ఇచ్చాడా? అని కొట్టిస్తాడు రాత్రికి. వెళ్తాను సార్. దణ్ణాలు'' పరుగెత్తుకుంటూ బల్లల కిందుగా లోపలికి వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం సామానుతోకూడా స్నేహితుడిని కలుసుకుని స్టేషన్‌కి చేరుకున్నాడు వీరభద్రం. టికెట్లు ముందే రిజర్వు చేసుకున్నారు. రైల్లో వాళ్ల సీట్లల్లో కూర్చున్నారు.

ఏదో మాటల సందర్భంలో ''నీవు వచ్చిన పనైందా?" అడిగాడు తోటి ఆఫీసరు వీరభద్రాన్ని. అతడు నవ్వాడు.

''ఆఫీసులో ఒకరి మాట ఒకరికి తెలియదు. నేనడిగిన విషయాలకు సంబంధించిన ఫైలును గురించి వాళ్లు పట్టించుకొనేలేదు ఇన్నాళ్లూ. మొన్న కాబోలు ఆఫీసరు దగ్గర్నించి జవాబు వస్తుందన్నారు. మొన్న నిన్న రాలేదు. ఇవాళ కాగితమ్మీద రాసి పంపించారు. "ఆ ఫైల్లో ఇంకా కొన్ని వివరాలు చేర్చవలసి ఉన్నది. కనుక వాళ్లను ఇప్పుడు వెళ్లమనండి" అని ఆఫీసరు దగ్గర్నుంచి ఫోను వచ్చింది. ఇంకా మనమెందుకిక్కడ? ఇప్పటికే అనవసరంగా పదిరోజులున్నాం అదనంగా'' అన్నాడు వీరభద్రం తోటి ఆఫీసరు కామేశం.

"మన మేంచేస్తాం? మన తప్పుకాదు కదా?'' అన్నాడు వీరభద్రం.

,,అయితే ఒకటి. నేను ఒక ఘనకార్యం చేశాననుకున్నాను. కష్టాలలో ఉన్నవాళ్లను ఆదుకుందామనుకున్నాను. నేను దిగిన హోటల్లో అరవైమంది సర్వర్లున్నారు. వాళ్లు పైకి యూనిఫారమ్‌లు వేసుకుని చాలా హుందాగా కనబడ తారు. మనం ఆత్మీయంగా పలకరిస్తే కడివెడు కన్నీళ్లు కారుస్తారు. వాళ్లకు కడుపునిండా తిండిలేదు కంటినిండా నిద్రలేదు. నాకు భోజనం తీసుకువచ్చే సర్వరు తనతోటి వాడిని గురించి నాకు చెప్పాడు. ఒకడు జీతమడిగాడట. ఒకడికి

చేతిలో ఉన్న మంచినీళ్లగ్లాసుల పళ్లెం, ఎదురు వచ్చిన వాడికి తగిలి కిందపడి గ్లాసులన్నీ వగిలిపోయాయట. ఆ రాత్రి నేలమాళిగలోకి సర్వర్లందరు వచ్చిన తరువాత వాళ్లను బడితెలతో కొట్టారుట. ముఖం మీద-, తలమీద తగిలిన దెబ్బ లకు రక్తం వరదలయి పోయిందట. వాళ్లు ఏడ్చి మొత్తుకున్నా వినకుండా తలుపు తాళంవేసి పైకి వెళ్ళిపోయాడట మేనేజరు. వాళ్లను చూసి మిగతా వాళ్లు పక్కకు తిరిగి కళ్లు తుడుచుకున్నారట. ఈ సంగతి నాకు ఒక సర్వరు చెప్పాడు. నేను భరించలేక పోలీసు కంప్లైయింటు చేశాను. పోలీసులు రైడ్‌చేసి సర్వర్లందరినీ తీసుకువెళ్ళారు. హోటళ్లను మూయించాలని పై ఆఫీసర్లకు రాయటం జరిగింది. ఈ విధంగా రెండు మూడు హోటళ్ళు రైడ్ చేసింది పోలీసు డిపార్టుమెంటు'' అన్నాడు వీరభద్రం.

''నేను దిగిన హోటలు కూడా ఇలాగే ఉంది. సర్వర్లు తిండిలేక— జీతాలు లేక చావు దెబ్బలు తింటున్నారు'' అన్నాడు వీరభద్రం.

"నేను చేసిన పనియొక్క ఫలితం పూర్తిగా విను. ఆ మరునాడు హోటళ్ల ప్రొప్రయిటర్లు పోలీసువారికి చేతులు తడిపి వాళ్ళను విడిపించి తెచ్చు కున్నారు. మళ్లీ యధాస్థితికి చేరుకుంది సర్వర్లవర్గం. హోటళ్ళలో తిరిగి చేర్చు కుని ''మీలో ఎవరు చెప్పారు పోలీసులకు'' అంటూ అందరికీ తిట్లు చివాట్లే కాకుండా దెబ్బలతో సత్కారం చేశారు. వీళ్ళకు నేను చేసింది ఉపకారమా లేక అపకారమా? నాకు రెండు రోజులు భోజనం చెయ్యబుద్ధి పుట్టలేదు." అన్నాడు.

"అపని నేను గంగారామ్ అనే పదిహేనేళ్ళలోపు పిల్లవాడు తన బాధలు చెప్పుకుంటే వినలేక పోలీసుస్టేషన్‌కి వెళ్ళాలనుకున్నాను. కాని - మనసెందుకో వెనక్కు లాగింది. దీనివల్ల వాడిని మరింత కష్టాలపాలు చేస్తానేమోననిపించి ఆగాను. మనమిచ్చిన టిప్పుకూడా మేనేజరు లాక్కుంటాడట'' అన్నాడు వీరభద్రం.

"వీళ్ళు ఖైదీలకంటె అన్యాయం. భోజనాలు కాఫీలు టిఫిన్లు వాళ్ళచేతిమీదుగా అనేకమందికి అందిస్తారు. కాని వాళ్ళనోటికి ఏ ఒక్కటీ అందదు. పేరుకుజీతాలు వందల సంఖ్యలో ఉంటాయి, కాని చేతికందవు. మనమిచ్చిన టిప్పును కొట్టి తీసు కుంటారు. సర్వర్లందరూ పారిపోకుండా కట్టుదిట్టాలు బాగాచేస్తారు. ఈసారి నేను రాను ఇక్కడికి రావాలని కుతూహల పడేవాళ్ళల్లోనుంచి ఎవరినయినా పంపిస్తారు" అన్నాడు అతడు.

"నాకూరావాలనిలేదు. కంటితో ఈ యమయాతనను చూడటం వినటంకూడా కష్టమే. కాని వీళ్ళకు ఎప్పుడు-ఏవిధంగా-విముక్తి కలుగుతుందని మనసులో బాధ" అన్నాడు వీరభద్రం

"వాళ్ళకు విముక్తిని మనం కలిగించలేం. అది ఏ పెద్దవాళ్లో కలుగచేసుకుని చేయవలసినపని."

కొంత సేపటికి ఇద్దరికీ నిద్ర తూగుతూవచ్చింది. వీరభద్రానికి గంగారామ్ కళ్ళముందర నిలబడి "ఎప్పుడైనా వస్తూఉండండిసార్. నాకు కొంత ఊరడింపుగా ఉంటుంది. మా అమ్మదగ్గరికి వెళ్ళలేనుగా! మీ రైనా రండిసార్" అన్నట్టనిపించి దిగ్గునలేచి కూర్చున్నాడు. యూనిఫారాలు వేసుకుని ఠీవిగా పెద్ద పెద్ద హోటళ్లలో తిరిగే సర్వర్లనే ఖైదీలను తలుచుకుంటూ ఒక పుస్తకం తీశాడు బేగ్‌లోనుంచి చదువుకోటానికి. అంతలోనే రాత్రివేళ ఈ గుడ్డి దీపాల వెలుగులో పుస్తకం చదవ గలనా? ఎలా? అనుకుని బైటికి తీశాను?" అనుకున్నాడు సర్దుకుని మళ్లీ పడుకుంటూ.

ఇంటికివచ్చిన తరువాత అతడికి తన కొడుకులలో గంగారామ్ కనిపిస్తు న్నాడు. కొన్నాళ్ళవరకూ గంగారామ్‌ని మరిచిపోలేక యమయాతన ననుభవిం చాడు వీరభద్రం.

❋❋